తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలి

- గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేయాలి
- అధికారులను ఆదేశించిన జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

స్థాయి సంఘ సమాశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

సంగారెడ్డి, మార్చి 6: వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు మిషన్ భగీరథ నీటిని సక్రమంగా సరఫరా చేయాలని, గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేయాలని జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో స్థాయీసంఘ సమావేశాలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు 2వ స్థాయీసంఘం(గ్రామీణాభివృద్ధి), 12 గంటలకు నాలుగో స్థాయీసంఘం(విద్య, వైద్యం), మధ్యాహ్నం 2.30గంటలకు 1వ స్థాయీసంఘం(ఆర్థిక-ప్రణాళిక), మధ్యాహ్నం 3.30గంటలకు 7వ స్థాయీసంఘం(పనులు)పై జరిగిన సమావేశాల్లో ఆయా శాఖల అధికారులు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు మంచినీటికి ఇబ్బంది లేకుండా నీటి సరఫరాను సక్రమంగా చేయాలన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేసి రోడ్లను పునరుద్ధరించాలన్నారు. సమావేశాల్లో జడ్పీటీసీలు కుమార్ గౌడ్, రాఘవరెడ్డి, కొండల్ రెడ్డి, లలిత, మీనాక్షి, రమేశ్, రాజు రాథోడ్, మల్లికార్జున్ పటేల్, నర్సింహారెడ్డి, సుధాకర్ రెడ్డి, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి స్వప్నతోపాటు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోలక్‌పల్లి రైతువేదికలో పాల్గొన్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

'రైతు నేస్తం'పై అవగాహన కల్పించాలి

వ్యవసాయాధికారులతో కలెక్టర్ వల్లూరు క్రాంతి

జిన్నారం, మార్చి 6 : జిల్లావ్యాప్తంగా రైతులకు 'రైతు నేస్తం' కార్యక్రమంపై వ్యవసాయాధికారులు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. జిన్నారం మండలంలోని సోలక్‌పల్లి రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు, వ్యవసాయాధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు అందించడం కోసం రైతు నేస్తం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీజనల్‌గా ఏ పంటలు ఎప్పుడు వేయాలి, ఎలాంటి ఎరువులు వాడాలి, భూమి సాంద్రత, పంటలకు సంబంధించిన పూర్తి వివరాలు రైతు నేస్తం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేందుకు, సాంకేతికపరంగా ఆర్గానిక్ పంటలపై దృష్టి సారించాలన్నారు. పండించిన పంటలకు మార్కెటింగ్ చేసుకోడానికి, వానకాలం, యాసంగి సీజన్‌లో 26 రకాల పంటల సాగు వివరాలను తెలుసుకోవచ్చన్నారు. పంట బీమా కల్పించి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ రైతు నేస్తంపై రైతులకు విశేష అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అంతకుముందు జిన్నారం రెవెన్యూ కార్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. భూసమస్యలపై అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ గురించి తహసీల్దార్ భిక్షపతిని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయం ఆవరణలో తనను కలిసిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, జిల్లా వ్యవసాయాధికారి నర్సింహా, ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఏడీఏ సురేశ్‌బాబు, ఏవో రవీంద్రనాథ్‌రెడ్డి, ఏఈవో దామోదర్, పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు జనాబాయి, స్వాతీప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీకాంత్‌రెడ్డి, శెట్టి శివరాజ్, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

'రైతునేస్తం'ను సద్వినియోగం చేసుకోవాలి

రాయికోడ్, మార్చి 6: 'రైతునేస్తం'ను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అధ్యక్షుడు మొగులప్ప అన్నారు. బుధవారం రాయికోడ్ రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వానకాలం నుంచి రాయికోడ్‌లో ప్రతి మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ ఉంటుందన్నారు. రాయికోడ్ వ్యవసాయ శాఖ డివిజన్ లోని వట్‌పల్లి, మునిపల్లి, రాయికోడ్ మండలాల రైతులు పాల్గొని అవపరమైన విషయాలను తెలుసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో షరీఫ్, నర్సింహులు, నాగ్‌శేటి, కేదార్‌నాథ్ పాటిల్, సతీశ్‌పంతులు, ప్రభాకర్ చారి, దుర్గేశ్, వెంకటేశం, ఏవోలు అబినాశ్ వర్మ, శివకుమార్, మహేశ్‌చౌహాన్, డివిజన్ ఏఈవోలు పాల్గొన్నారు.

సిర్గాపూర్‌లో ...

సిర్గాపూర్, మార్చి 6: సిర్గాపూర్ రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని రైతునేస్తంలో సీఎం రేవంత్‌రెడ్డి దృశ్యశ్రవణంలో సూచించిన ఆధునిక సాంకేతిక వ్యవసాయంపై సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. యాసంగిలో జొన్నపంటను కొనుగోలు చేస్తామన్నారు. ఏడీఏ నూతనకుమార్, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఏవో శశాంక్, ఎంపీటీసీ పీరప్ప, ఏఈవోలు రఘునాథ్, భార్గవ్, శివకుమార్, శ్వేత, రైతులు ఉన్నారు.

రవాణా ఖర్చులు లేకుండా సరఫరా చేయండి

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

సంగారెడ్డి మార్చి 6 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి జిల్లాలో సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)లకు రవాణా ఖర్చులు లేకుండా ఎరువులు సరఫరా చేయాలని ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో వానకాలం, యాసంగి సీజన్లలో 87 సెంటర్ల ద్వారా రైతులకు ఎరువులు అందజేశామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా ఉమ్మడి జిల్లాలోని డీసీఎంఎస్ విక్రయ కేంద్రాలకు ఎలాంటి రవాణా చార్జీలు లేకుండా ఎరువులను సరఫరా చేసిందన్నారు. జనవరి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం డీసీఎంఎస్‌లకు సరఫరా చేస్తున్న ఎరువులకు రవాణాచార్జీలు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. దీని వల్ల ఎరువులు కొనుగోలు చేసే రైతులు రవాణా చార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రైతులపై భారం పడకుండా ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా రవాణా చార్జీలు లేకుంగా ఎరువులు సరఫరా చేయాలని కోరారు.

పెన్నార్ కార్మిక సంఘం ఎన్నికల్లో బీఆర్‌టీయూ జయకేతనం

బీఆర్‌టీయూ నేతలతో కార్మికుల విజయోత్సవ సంబురాలు

పటాన్‌చెరు, మార్చి 6: పెన్నార్ పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్‌టీయూ ఘన విజయం సాధించింది. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ అధ్యక్షుడిగా పోటీ చేసి విజయం సాధించారు. బుధవారం పటాన్‌చెరులో పెన్నార్ పరిశ్రమలో కార్మిక సంఘం ఎన్నికలు జరిగాయి. మొత్తం 508 ఓట్లకు 507 ఓట్లు పోలయ్యాయి. ఇందులో రెండు ఓట్లు చెల్లలేదు. బీఆర్‌టీయూ సంఘానికి 282 ఓట్లు రాగా, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ ఐక్యకూటమికి 223 ఓట్లు వచ్చాయి. 59 ఓట్ల మెజార్టీతో బీఆర్‌టీయూ గెలుపొందింది. వరుసగా రెండోసారి బీఆర్‌టీయూ కార్మిక సంఘం గెలుపొందింది. విజయాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హర్షం వ్యక్తం చేయడంతోపాటు బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్‌ను అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు గూడెం మధుసూదన్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

అదనపు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి


ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

సంగారెడ్డి, మార్చి 6: మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న అదనపు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌బాబుపై చర్యలు తీసుకోవాలంటూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని వివరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు యాదగిరి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు ఇవ్వాలని, అక్రమంగా తొలిగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చిన వారిలో మున్సిపల్ యూనియన్ నాయకులు సువర్ణ, యాదగిరి, శ్రీనివాస్, యాదయ్య, సురేందర్ ఉన్నారు.

జీరో బిల్లులపై ఆగ్రహం

పుల్కల్, మార్చి 6: గృహజ్యోతి పథకం కింద 70 యూనిట్లు వచ్చినా జీరో బిల్లు రావడంలేదని సభ్యులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీపీ చైతన్యవిజయ్‌భాస్కర్ రెడ్డి అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన వారికి ఉచిత కరెంటు అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన మాట అవాస్తవమా..లేక విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమా అంటూ ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శివ్వంపేట ఎంపీటీసీ కిరణ్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ఎప్పుడు చూసినా పశు వైద్యశాలకు తాళం వేసి ఉండడంతో రైతులు పశువులను ఎక్కడికి తీసుకెళ్లాలో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. పశు వైద్యాధికారి దీపాంకర్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది కొరతతో నేరుగా ఫీల్డ్‌లో కి వెళ్తున్నట్లుచెప్పారు. విద్యుత్ శాఖ అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంతో ఎంపీడీవో ఆనంద్‌మేరి లైన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ చైతన్యవిజయ్‌భాస్కర్ రెడ్డి కలుగజేసుకొని అధికారులు ప్రజలతో కలిసిమెలిసి పనిచేయాలని సూచించారు. రెండు, మూడు రోజుల్లో మండల కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం ప్రజాపాలన సేవాకేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఎం పీడీవోలు మధులత, జయలక్ష్మి, 34 గ్రామా ల సర్పంచ్‌లను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

డేటా అనాలసిస్ కీలక పాత్ర

మాట్లాడుతున్న ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్, ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 6: ఆధునిక కాలంలో వివిధ పరిశోధనలకు సంబంధించిన సమాచారాన్ని సులభంగా విశ్లేషించేందుకు, సరైన ఫలితాలను సాధించేందుకు ఎస్‌పీఎస్ఎస్ సాఫ్ట్‌వేర్ ఉపయోగపడుతుందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ ఆర్థిక సహకారంతో పరిశోధనకు ఉపయోగపడే ఎస్‌పీఎస్ఎస్ అనే అంశంపై బుధవారం తారా ప్రభుత్వ కళాశాల ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆధునిక కాలంలో డేటా అనాలిసిస్ ప్రాముఖ్యతను వివరించారు. అతిసులభంగా డేటాను నిర్వహించే వివిధ పద్ధతులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం హైదరాబాద్ బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీఅ విభాగాధిపతి, ప్రొఫెసర్ వీవీ హరగోపాల్ మాట్లాడుతూ ప్రతి పరిశోధనకు సంబంధించిన విషయంలో సరైన ఫలితాలను రాబట్టడంలో ఎస్‌పీఎస్ఎస్‌ను ఏవిధంగా పరిశోధనలో ఉపయోగించవచ్చునో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ మాట్లాడుతూ రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్‌కు ఆర్థిక సహకారం అందించిన మలబార్ గోల్డ్, శ్రీనివాసన్ పైప్ ఇండస్ట్రీస్ అధినేత వెంకన్నలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ రత్నప్రసాద్, మలబార్ గోల్డ్, అసిస్టెంట్ మేనేజర్ లంకేశ్, పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ వెంకటేశం, కోకన్వీనర్ డాక్టర్ నాగప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ జగదీశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య

పటాన్‌చెరు, మార్చి 6: మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. బుధవారం పటాన్‌చెరులోని మున్నూరుకాపు భవన్‌లో జిల్లా అధ్యక్షుడు నాయికోటి యాదగిరితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవయ్య మాట్లాడుతూ మున్నూరుకాపులకు ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసే పార్టీలకు ఎంపీ ఎన్నికల్లో మద్దతు ఇస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కాపులకు రూ.5వేల కోట్లతో ఫైనాన్స్ కార్పొరేషన్ నడుస్తున్నదన్నారు. తెలంగాణలో లేకపోవడంతో మున్నూరుకాపులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో మున్నూరుకాపులకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. యాదగిరి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో ఎకరా స్థలం మున్నూరు కాపు సంఘానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. మున్నూరుకాపుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయికోటి రాజు, పటేల్, జిల్లా ప్రధానకార్యదర్శి పవన్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండమొల్ల రాజు, గౌరవ సలహాదారు నాయికోటి జీతయ్య, మైలారం సత్యనారాయణ, నాయికోటి వెంకటేశ్, కాసాల నర్సింగ్‌రావు, నర్ర కృష్ణ, బుచ్చయ్య, నేతలు పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్‌కు ఏకగ్రీవ ఆమోదం

అందోల్: మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

అందోల్, మార్చి 6: అందోల్-జోగిపేట మున్సిపాలిటీకి సంబంధించి 2024-25 సంవత్సరానికి ప్రవేశ పెట్టిన మున్సిపల్ బడ్జెట్‌కు పాలకవర్గం సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. చైర్మన్ మల్ల య్య అధ్యక్షతన బుధవారం మున్సిపల్ బడ్జెట్ ప్రత్యేక సమావేశం నిర్వహించగా అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్) చంద్రశేఖర్ హాజరయ్యారు. సమావేశంలో 2024-25 సంవత్సరానికి అంచనా ఆదాయం రూ.51.07 కోట్లు కాగా, అంచనా వ్యయం రూ.50.88 కోట్లుండగా పాలకవర్గం సభ్యు లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ తిరుపతి, వైస్‌చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మేళ్ల చెరువు ఆక్రమణపై అధికారుల కొరడా

రామచంద్రాపురం, మార్చి 6: తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు ఎఫ్‌టీఎల్‌లో రాజుయాదవ్ మట్టిని నింపి ఆక్రమణకు పాల్పడ్డాడు. గతంలోనే ఇరిగేషన్ అధికారులు ఆక్రమణను అడ్డుకొని కేసులు నమోదు చేశా రు. అయినా సదరు వ్యక్తి ఇటీవల చెరువు ఎఫ్‌టీఎల్‌లో మట్టిని నింపి ప్రహరీ నెలకొల్పాడు. ఈ విషయంపై కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫిర్యాదు వెళ్లింది. దీంతో బుధవారం ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు సంయుక్తంగా పోలీసుల సహకారంతో మేళ్ల చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, ప్రహరీ, ఇతర నిర్మాణాలను జేసీబీ సాయంతో కూల్చీవేశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఎస్ఈ మురళీధర్, తహసీల్దార్ సంగ్రాంరెడ్డి మాట్లాడుతూ మేళ్ల చెరువు ఎఫ్‌టీఎల్‌లోఅక్రమాలను తొలిగించామన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

సదస్సులో పాల్గొన్న మహిళా న్యాయమూర్తులు, సిబ్బంది

సంగారెడ్డి, మార్చి 6: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు సూచించారు. బుధవారం కోర్టు ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మహిళలు గృహహింస, పోక్సో, సైబర్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయ సాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని న్యాయమూర్తి సూచించారు. సదస్సులో మొదటి అదనపు జిల్లా జడ్జి సుదర్శన్, రెండో అదనపు జడ్జి కృష్ణార్జున, మూడో అదనపు జడ్జి సునీతారవీందర్‌రెడ్డి, నాలుగో అదనపు జడ్జి లావణ్య, సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్, మెజిస్ట్రేట్ న్యాయమూర్తులు లక్ష్మణచారి, శాలిని సకెల్లి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మహిళా అధికారులు, మహిళా న్యాయవాదులు, పాల్గొన్నారు. టీఎస్ఆర్టీసీ సంగారెడ్డి డిపోలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రీజినల్ మేనేజర్ ప్రభులత హాజరయ్యారు. మహిళా ఉద్యోగులకు ఆటలపోటీలు నిర్వహించి విజయం సాధించిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఉప ప్రాంతీయ మేనేజర్ జోత్స్న, డిపో మేనేజర్ ఉపేందర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిశ్రమలో అగ్ని ప్రమాదం

- నలుగురు కార్మికులకు తీవ్రగాయాలు
- దవాఖానలో ఒకరి మృతి, ముగ్గురి పరిస్థితి విషమం

కోవాలెంట్ పరిశ్రమ ఎదుట ఆందోళ న చేస్తున్న మృతుడి కుటుంబీకులు,గ్రామస్తులు

హత్నూర, మార్చి 6: పరిశ్రమలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి నలుగురు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సనిమిత్తం దవాఖానకు తరలించగా ఒక కార్మికుడు మృతి చెందగా, ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. హత్నూర మండలం గుండ్లమాచునూర్ శివారులోని కోవాలెంట్ ల్యాబరెటరీ పరిశ్రమలో మంగళవారం సాయంత్రం ప్రొడక్షన్ బ్లాక్-4లో హత్నూర గ్రామానికి చెందిన నీరుడి వినోద్‌కుమార్(26)తోపాటు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన స్వాదిన్‌రాజమల్, లాల్‌బాబుతుర్రై, ఫాదర్ మరండీ విధులు నిర్వహిస్తుండగా ఏఎన్ఎఫ్‌డీ రియాక్టర్ నుంచి ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు చెలరేగడంతో కార్మికులు మంటల్లో కాలుతూ పరుగులు తీశారు. దీనిని గమనించిన తోటి కార్మికులు సేఫ్టీ పరికరాలు ఉపయోగించి మంటలు ఆర్పివేశారు. అగ్నిప్రమాదంలో గాయపడిన నలుగురు కార్మికులను పరిశ్రమ యాజమాన్యం హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ నీరుడి వినోద్ కుమార్ బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మరో ముగ్గురు కార్మికులు వెంటిలేటర్‌పై చికిత్సపొందుతూ విషమ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మృతుడు నీరుడి వినోద్‌కుమార్‌కు భార్య వీరమని, ఆరు నెలల బాలుడితోపాటు తల్లిదండ్రులు ఉన్నారు.

కుటుంబీకులు, గ్రామస్తుల ఆందోళ న

వినోద్‌కుమార్ మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న కుటుంబీకులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో బుధవారం పరిశ్రమ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం మూలంగానే అగ్నిప్రమాదం చోటుచేసుకుందని ఆరోపించారు. పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకొని మృతుడి కుటుంబీకులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ప్రవీణ్‌కుమార్, హత్నూర తహసీల్దార్ ఫర్హీన్‌షేక్ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కార్మికుడు మృతిచెందడంతోపాటు ముగ్గురు కార్మికుల పరిస్థితి విషమంగా ఉండటంతో పరిశ్రమ యాజమాన్యంపై కేసునమోదు చేసినట్లు హత్నూర ఎస్ఐ సుభాష్ తెలిపారు.

బండరాయితో కొట్టి వ్యక్తి హత్య


మృతుడు యాదగిరి(ఫైల్)

బొల్లారం మార్చి 6: వ్యక్తిని బండరాయితో కొట్టి హత్య చేసిన ఘటన ఐడీఏ బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గచ్చిబౌలి ఖాజాగూ డ నివాసి వడ్డెర యాదగిరి(38) ప్రస్తుతం బొల్లారం బీరప్పబస్తీలో ఉంటున్నాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో యాదగిరి హత్యకు గురయ్యాడు. ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. జిన్నారం సీఐ సుధీర్‌కుమార్, బొల్లారం ఎస్సై దశరథ్ ఘటనాస్థలానికి చేరుకొని ప్రాథమిక విచారణ చేపట్టారు. మృతుడి తలను బండరాయితో మోది హత్యచేసినట్లు నిర్ధారించారు. నిందితుడి కోసం గాలించగా రెండు గంటల వ్యవధిలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. యాదగిరి హత్య కు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమో దు చేశారు.

కూలీల సంఖ్య పెంచాలి

కోహీర్, మార్చి 6: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో భారతి అన్నారు. బుధవారం కోహీర్ పట్టణంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఈజీఎస్ పనులు కల్పించాలని, అడిగిన కూలీలందరికీ జాబ్‌కార్డులు అందించాలని సూచించారు. కొలతల ప్రకారం బిల్లులు వస్తాయని కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. నర్సరీల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. సమావేశంలో ఏపీవో సునందరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

కారు గ్యారేజీలో అగ్నిప్రమాదం

నారాయణఖేడ్, మార్చి 6: నారాయణఖేడ్ పట్టణం కరస్‌గుత్తి రోడ్డులోని కారు గ్యారేజీలో భారీ అగ్నిప్రమాదం సంభవించడంతో గ్యారేజీలోని ఐదు కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికల కథనం ప్రకారం.. గ్యారేజీలో నిలిపిన కారులోని సీఎన్‌జీ సిలిండర్ పేలిపోయి వంద మీటర్ల దూరంలో పడింది. అకస్మాత్తుగా జరిగిన ఘటనతో భయాందోళనకు గురైన చుట్టపక్కల జనం కారు గ్యారేజీ వద్దకు పరుగులు తీయగా అప్పటికే గ్యారేజీలో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. మంటలు పక్కనున్న కార్లకు వ్యాపించాయి. అప్రమత్తమైన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించడంతో అగ్నిమాపక శకటం వచ్చి మంటలు ఆర్పేలోగా ఐదు కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. విషయాన్ని తెలుసుకున్న మాజీఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకోవడంతోపాటు బాధితులకు ధైర్యం చెప్పారు.

ఆరోగ్య ఉపకేంద్రానికి భూమిపూజ

సిర్గాపూర్, మార్చి 6: సిర్గాపూర్‌లో ఆరోగ్య ఉప కేంద్రం నూతన భవన నిర్మాణానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి బుధవారం ఎంపీటీసీ పీరప్పతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు దవాఖాన ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మనీశ్‌పాటిల్, స్వప్నాశంకరయ్య, శ్రీనివాస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

చౌటకూర్, మార్చి 6: పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని మండల విద్యాశాఖ అధికారి దండు అంజయ్య సూచించారు. శివంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పబ్లిక్ పరీక్షల దృష్ట్యా శ్రద్ధతో చదవాలన్నారు. వందశాతం ఫలితాలు సాధించి 10 జీపీఏ సాధించాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

భూసమస్యలపై దరఖాస్తులు

గుమ్మడిదల, మార్చి 6: మండలంలోని కానుకుంట, అన్నారం గ్రామాల్లో భూసమస్యలపై రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. బుధవారం నాయబ్ తహసీల్దార్ కరుణాకర్‌రావు, ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి బృందం కానుకుంట, అన్నారంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ధరణి పోర్టల్ ద్వారా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలను పరిష్కరించనున్నట్లు నాయబ్ తహసీల్దార్ తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR JUDGE AT: SANGAREDDY OS.NO. 681 OF 2019
BETWEEN:
Smt. Sabera Bee (died) per LRs & Others ...Plaintiffs
And
Md.Ismail & Others ...Defendants
To
1. Smt. Salma Begum W/o MD. Mahaboob Ali, aged about 35 years, Occ: House wife, R/o H.No. 3-7-85/29/1, Siddapur colony, Sadasivpet town and district Sangareddy 502291.
2. Smt. Zaheera Begum W/o Abdul Jabbar Miya aged about: 33 years, Occ: house wife, R/o H.NO.3-7-83-15/1, Hatkargally, Sadasivpet village and town,Dist sangareddy 502 291.
3. Smt. Razia Begum W/o MD. Basheer, aged about: 32 years, Occ: House wife, R/o H.No. 5-4-103-100-1, Siddapur colony, Sadasivpet town and district sangareddy - 502 291.
4. MD. Kairati S/o Late Ismail sab, aged about:60 years, Occ: Labour, R/o H.No. 3-6-63, Hatkarpet, Sadasivpet sangareddy district 502 291.
5. MD. Akbar Sab, S/o Ismail sab aged about: 56 years, Occ: driver R/o.H.No. 3-6-63, Hatkarpet, Sadasivpet town and district sangareddy 502291.
6. Smt Farida Begum W/o Late MD Gouse, aged about:28 years, Occ: Labour, R/o H.No.3-6-63, Hatkarpet, Sadasivpet and sangareddy district 502291. (Son of Beyabee)
7. MD. Habed, S/o Late Ismail Occ: driver, H.No. 3-6-63, Hatkarpet, Sadasivpet, Sangareddy district 502291

NOTICE

To take notice that the plaintiffs filed a suit for Partition and possession in respect of suit schedule properties against the defendants and the same case is posted to 14-03-2024 for your appearance (Defendants No.6 to 8, 10, 12, 18 and 19) before Hon'ble Principal Junior Civil Judge, Sangareddy at 10.30 A.M., by person or through counsel failing which the matter will be decided against you.

// BY COURT ORDER //
Sd/- **T.SATHYANARAYANA, B.ARJUN & M. MADHU MOHAN**
Advocates-Sangareddy
Date: 07-03-2024 Place: Sangareddy.

డాక్యుమెంట్ పోయినది

పెద్దపట్లోల్లు భాగ్యమ్మ, భర్త: పెద్దపట్లోల్లు జనార్దన్ రెడ్డి, ఇం.నెం. 4-68, అమీన్‌పూర్ (గ్రా) & (మం), సంగారెడ్డి వాసినైన నేను 24-02-2024న మా ఇల్లు వాష్ చేస్తుండగా నెం. 20420/2022, తేది: 03-06-2022 ఆఫ్ SRO సంగారెడ్డి కలిగిన నా ఒరిజినల్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్‌ను పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికితే సంప్రదించండి. సెల్: 9866563132.